


'సదన్' చిన్నారులు..

మానవతా సదన్ చిన్నారులు భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదగాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆకాంక్షించారు.

- 8లో ▸



ఇఫ్తార్ గురు : 6:35 | సహర్ శుక్ర: 4:51

రంజాన్ వేళలు

గరిష్టం/కనిష్టం
40.2 /18.8

వాతావరణం

ఈదురుగాలులు వీస్తాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ధాన్యం సేకరణ పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్

నిజామాబాద్ అర్బన్: యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 08462–220183ను సంప్రదించాలని సూచించారు. రైతులు ఫిర్యాదులు చేయడంతోపాటు తమ సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు కంట్రోల్ రూమ్ పని చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నంబర్లు 180042500333/ 1967ను కూడా సంప్రదించొచ్చని సూచించారు.

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు



నిజామాబాద్ రూరల్: శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామరాజు సూచించారు. సమీకృత కార్యాలయాల సముదాయంలోని దేవాదాయశాఖ కార్యాలయంలో బుధవారం కార్యనిర్వహణాధికారులు, జూనియర్ అసిస్టెంట్లు పరిశీలకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ.. భక్తుల కోసం చలువ పందిళ్లు వేయడంతోపాటు తాగునీరు, మజ్జిగ అందించాలని, క్యూలైన్ల కోసం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దేవాలయాల భూములు అన్యాక్రాంతానికి సంబంధించిన కేసులకు కౌంటర్లు తప్పనిసరిగావేయాలని అన్నారు. ఏవోలు, జూనియర్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.


అక్రమ వడ్డీ వ్యాపారులపై కొరడా

కామారెడ్డి క్రైం: అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. బుధవారం కామారెడ్డి జిల్లాలో ఏకకాలంలో 69 చోట్ల దాడులు చేసి 16 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు మోసపూరిత మాటలతో ప్రజల వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఆస్తులకు సంబంధించిన దస్తావేజులు తాకట్టు పెట్టుకుంటూ అధిక వడ్డీ రేట్లకు అప్పులు ఇస్తున్నారు. డబ్బులు తిరిగి చెల్లించలేని పరిస్థితులను తీసుకువస్తూ అమాయకుల ఆస్తులను జప్తు చేసుకుంటున్నారు. ఇలాంటి బాధలతో చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ విషయం పోలీసుల దృష్టికి రావడంతో బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దాడులు నిర్వహించామని ఎస్పీ తెలిపారు. 16 కేసులు నమోదు చేసి, విలువైన డాక్యుమెంట్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అంతా మాస్!

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామన్న ఉన్నతాధికారుల వ్యాఖ్యలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. మాస్‌కాపీయింగ్ జోరుగా సాగుతోంది. అయితే విద్యార్థులను పరీక్షల నిర్వహణ అధికారులే ప్రోత్సహిస్తుండడం గమనార్హం. పరీక్షలు ప్రారంభమైన రోజునే పాఠ్య పుస్తకాలు, జిరాక్స్ మిషన్‌తో సహా చీటీలు పంపిణీ చేసిన వ్యవహారాన్ని బయటికి పొక్కకుండా అధికారులు తొక్కిపెట్టారు. – నిజామాబాద్ అర్బన్

- నందిపేట సెంటర్‌లో ఇన్విజిలేటర్ చేతిలో చీటీలు
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న జిల్లా అబ్జర్వర్
- ధర్మారంలో తొలిరోజే నలుగురిని విచారించిన పోలీసులు
- అనుమానితుల వద్ద లభ్యమైన పాఠ్యపుస్తకాలు
- మండలాల్లో జోరుగా మాస్ కాపీయింగ్
- కీలకపాత్ర పోషిస్తున్న ప్రధాన సంఘాల నాయకులు



ఈ నెల 21న ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభం కాగా, జిల్లాలో 141 సెంటర్లను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసిన జిల్లా విద్యాశాఖ క్షేత్రస్థాయిలో మాత్రం మాస్‌కాపీయింగ్‌ను అరికట్టలేకపోతోంది. పరీక్షల నిర్వహణ విధుల్లో ఉన్న అధికారులు, ఇన్విజిలేటర్లు దగ్గరుండి మాస్‌కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తుండడం శోచనీయం.

▪ పరీక్షలు ప్రారంభమైన రోజునే డిచ్‌పల్లి మండలం ధర్మారం సెంటర్ వద్ద కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా, అదే సమయంలో తనిఖీకి వెళ్లిన ఎస్సై వారిని ప్రశ్నించారు. వారి వద్ద తెలుగు పరీక్షకు సంబంధించిన పుస్తకాలు, మెటీరియల్ లభించింది. జవాబులను జిరాక్స్ తీసేందుకు మిషన్ కూడా ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. కానీ ఈ వ్యవహారాన్ని మాత్రం బయటకు పొక్కనీయలేదు. ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. కనీసం విచారణ కూడా చేపట్టలేదు .సెంటర్ నిర్వాహణకు సంబంధించి ఓ ముఖ్య అధికారి ఇందులో ప్రధాన పాత్ర పోషించగా, జిల్లా అధికారులను సంప్రదించి ఈ వ్యవహారాన్ని తొక్కి పెట్టినట్లు తెలిసింది. ప్రతి విద్యార్థి నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేశారనే ఆరోపణలున్నాయి.

▪ బుధవారం గణితం పరీక్ష జరగగా, నందిపేట జెడ్పీహెచ్‌ఎస్ సెంటర్‌ను జిల్లా అబ్జర్వర్ ఉషారాణి తనిఖీ చేశారు. ఆ సమయంలో ఇన్విజిలేటర్ సాజిద్ చేతిలో చీటీలు కనిపించడంతో ఆమె ప్రశ్నించారు. సాజిద్ సమాధానం చెప్పకపోవడంతో చర్యల నిమిత్తం జిల్లా విద్యాశాఖాధికారికి జిల్లా అబ్జర్వర్ సిఫారసు చేశారు. బుధవారం రోజునే సాజిద్‌కు షోకాజ్ నోటీసు జారీ అయ్యింది.

జిల్లా కేంద్రంలో పకడ్బందీగా.. మండలాల్లో మాస్ కాపీయింగ్



జిల్లా కేంద్రంలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతుండగా, మండల కేంద్రాల్లో మాత్రం జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతోంది. ఆయా మండలాల్లో పరీక్షల నిర్వహణు ప్రధాన సంఘాల నాయకులు ప్రభావితం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంలో పరీక్ష కేంద్రం ఉండడంతో ఆ మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ పని కావాలంటే ప్రధాన సంఘాల నాయకులను కలుస్తున్నారు. ఆయా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు ఇన్విజిలేటర్ల కేటాయింపు నుంచి మాస్‌కాపీయింగ్ వరకు అంతా చూసుకుంటున్నారు. పరీక్షల విధులు నిర్వర్తించే వారికి రెండు రోజులకోసారి విందులు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు ఆకస్మిక తనిఖీలకు వచ్చే ముందే సమాచారం అందుకుంటూ మాస్‌కాపీయింగ్‌ను పకడ్బందీగా సాగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు సక్రమంగా లేకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది.



41 మంది గైర్హాజరు

బుధవారం నిర్వహించిన గణితం పరీక్షకు మొత్తం 41 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 22,779 విద్యార్థులకుగాను 22,730 మంది పరీక్ష రాశారు.

విధుల నుంచి తొలగింపు

పరీక్షల జిల్లా అబ్జర్వర్ తనిఖీలకు వచ్చిన సమయంలో నందిపేట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ సెంటర్‌లో ఇన్విజిలేటర్ సాజిద్ చేతిలో చీటీలు లభించాయి. దీంతో ఆమె చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించారు. విచారణ చేపట్టిన అధికారులు చీఫ్‌సూపరింటెండెంట్‌తోపాటు ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

విచారించింది వాస్తవమే..

ధర్మారం పరీక్ష కేంద్రం వద్ద నలుగురు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని విచారించింది వాస్తవమే. వారి వద్ద పుస్తకాలు లభ్యమయ్యాయి. విద్యార్థులతోపాటు వచ్చినట్లు వారు తెలిపారు. విచారణ అనంతరం వదిలేశాం.

– ఎండీ షరీఫ్, ఎస్సై, డిచ్‌పల్లి

క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం



నందిపేట్ సెంటర్‌లో విధులను నిర్లక్ష్యం చేసిన ఇన్విజిలేటర్ సాజిద్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చిన అనంతరం విధుల నుంచి తప్పించాం. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. మాస్‌కాపీయింగ్ వ్యవహారంపై విచారణ కొనసాగుతుంది. – అశోక్, డీఈవో

పన్ను బకాయిదారులకు ఓటీఎస్ స్కీమ్

- ఒకే విడతలో మొత్తం చెల్లించే వారికి జరిమానాపై 90శాతం రాయితీ
- ఇప్పటికే చెల్లించిన వారికి భవిష్యత్ చెల్లింపుల్లో సర్దుబాటు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వెల్లడి

నిజామాబాద్ అర్బన్: ఆస్తి పన్ను బకాయిదారుల కోసం ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) స్కీమ్‌ను అమలు చేస్తోందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా మొత్తం పన్ను చెల్లించే బకాయిదారులకు జరిమానాపై 90శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. నిజామాబాద్ నగర పాలక సంస్థతోపాటు జిల్లాలోని బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రమే వన్ టైం సెటిల్‌మెంట్‌ను ప్రభుత్వం అమలు చేయగా, ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు రాష్ట్రంలోని అన్ని మున్సి పాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సకాలంలో పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కలెక్టర్ కోరారు. ఓటీఎస్ అమలులోకి రాకముందే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నును వడ్డీ, జరిమానాలతో కలిపి చెల్లించిన వారికి భవిష్యత్ చెల్లింపులలో రాయితీని సర్దుబాటు చేస్తారని కలెక్టర్ తెలిపారు.

శ్రద్ధానంద్ గంజ్‌కు వరుస సెలవులు

సుభాష్‌నగర్: ది నిజామాబాద్ మర్చంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు శ్రద్ధానంద్ గంజ్‌కు వరుస సెలవులు ప్రకటించినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరం వ్యాపార ముగింపు లెక్కల సందర్భంగా 28న మార్కెట్‌యార్డులో ఎలాంటి వ్యాపార లావాదేవీలు నిర్వహించబోమని పేర్కొన్నారు. అలాగే 29న అమావాస్య, 30న ఉగాది, రంజాన్ సందర్భంగా 31న, మరుసటి రోజైన ఏప్రిల్ 1న మార్కెట్‌లో క్రయావిక్రయాలు నిర్వహించడం లేదని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సెలవురోజుల్లో పంట దిగుబడులను మార్కెట్‌యార్డుకు తీసుకురావొద్దని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి మార్కెట్‌యార్డు కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని అపర్ణ తెలిపారు.

బల్దియాపై ఏసీబీ నజర్

- ఆర్‌వో నరేందర్ ఆస్తుల వివరాల సేకరణ
- ఇద్దరు ఉన్నతాధికారులపై దృష్టి
- తరచూ కమిషనర్‌ను కలుస్తున్న అధికారులు?

నిజామాబాద్ సిటీ: అవినీతి నిరోధకశాఖ అధికారులు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌పై ప్రత్యేకంగా నజర్ పెట్టారు. ఏసీబీ అధికారులతోపాటు సిబ్బంది కార్పొరేషన్ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. వారి కదలికలు ఇటీవల ఎక్కువయ్యాయి. పలువురు ఉద్యోగులు, సిబ్బందిని తరచూ కలుస్తున్నారు.

లిఖిత పూర్వక సమాధానల కోసం..

మున్సిపల్ కార్పొరేషన్‌లో రెవెన్యూ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించిన దాసరి నరేందర్ గతేడాది ఆగస్టు 6వ తేదీన ఏసీబీకి చిక్కారు. ఆయన నివాసంలో కోట్ల రూపాయల నగదు దొరకగా, ఆయనను సస్పెండ్ చేశారు. అయితే గత కొద్ది నెలలుగా ఏసీబీ అధికారులు నరేందర్ ఆస్తుల



వివరాలను సేకరిస్తున్నారు. స్థిర, చరాస్తుల తోపాటు ఇతర సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. గతంలో బల్దియా కమిషనర్‌గా పని చేసిన మంద మకరందు, ప్రస్తుత కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిశారు. పలు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని లిఖితపూర్వకంగా అడిగారు. తాజాగా మళ్లీ కమిషనర్‌ను కలిసి తాము అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు కావాలని కోరారు. సుమారు వారం రోజుల వ్యవధిలో కమిషనర్ దిలీప్‌కుమార్ రెండుసార్లు కలిశారు.

ఆ ఇద్దరిపై..

కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఇద్దరు ఉన్నతాధికారులపై కూడా ఏసీబీ నజర్ పెట్టినట్లు తెలుస్తోంది. త్వరలోనే పదవీ విరమణ పొందనున్న సదరు అధికారులు ఇద్దరు బల్దియాలో ప్రధాన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇదివరకే పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఏసీబీ దృష్టి సారించినట్లు తెలిసింది.

వివరాలు అడిగారు



నా చాంబర్‌కు వచ్చి ఏసీబీ అధికారులు కలిశారు. గతంలో ఏసీబీకి పట్టుబడిన నరేందర్‌కు సంబంధించిన కొన్ని వివరాలు అడిగిన విషయం వాస్తవమే. వారు కొన్ని ప్రశ్నలకు సమాధానాలు అడిగారు. వాటిని మేం ఇదివరకే ఇచ్చాం. అయితే పూర్తిస్థాయి సమాధానాలు కావాలని మళ్లీ అడిగారు. వాటికి కూడా లిఖితపూర్వకంగా సమాధానాలిస్తాం. – దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

కదిలిన యంత్రాంగం

- డెంగీతో యువతి మృతి ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఇటీవల డెంగీతో మృతి చెందిన యువతి స్ఫూర్తి కుటుంబ సభ్యులు 'ఇంకెవ్వరికీ ఇలా జరగొద్దు' అంటూ ఫ్లెక్సీల ఏర్పాటు చేయగా, దీనిపై 'సాక్షి' మెయిన్‌లో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించారు. యువతి మృతి ఘటనను ఆ శాఖ రాష్ట్ర కమిషనర్‌తోపాటు కలెక్టర్ సీరియస్‌గా పరిగణిస్తూ డీఎంహెచ్‌వో రాజశ్రీని వివరణ కోరినట్లు తెలిసింది.

నర్సింగ్‌పల్లి గ్రామాన్ని ముదక్‌పల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, ఎన్‌సీవీ బీడీసీపీ ప్రోగ్రాం అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, పీహెచ్‌సీ సిబ్బంది సందర్శించి జ్వర సర్వే నిర్వహించి, ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ, జెడ్పీహెచ్‌ఎస్‌లో కీటక జనిత వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో జిల్లాలో ఎక్కడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులను ఆదేశించామని డీఎంహెచ్‌వో రాజశ్రీ తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షల్లో భాగంగా ర్యాపిడ్ టెస్ట్‌లు నిర్వహిస్తే పాజిటివ్ వచ్చిన వెంటనే జీజీహెచ్‌కు డెంగీ ఎలీసా పరీక్షలు, డెంగీ నిర్ధారణ కోసం శాంపిళ్లను పంపించాలని ఆదేశించామన్నారు. అయినా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు శాంపిళ్లను జీజీహెచ్‌కు పంపించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఇక ముందు ఇలాగే కొనసాగితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.


ఇంకెవ్వరికీ ఇలా జరగొద్దు

సాక్షి మెయిన్‌లో ప్రచురితమైన కథనం

నన్ను ఎన్‌కౌంటర్ చేయండి..

- ఎస్సై వేధిస్తున్నాడంటూ నిందితుడి ఆరోపణ

ఖలీల్‌వాడి: 'తనను వేధించడానికి బదులుగా ఎన్‌కౌంటర్ చేసేయండి' అంటూ నిజామాబాద్ నగరానికి చెందిన షేక్ రసూల్ అనే వ్యక్తి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నాలుగు నెలల క్రితం నిజామాబాద్ మాజీ మేయర్ నీతూ కిరణ్ భర్త దండు శేఖర్‌పై దాడి చేసిన కేసులో రసూల్ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో అరెస్టయిన రసూల్ కొద్ది రోజుల క్రితం కండిషనల్ బెయిల్‌పై బయటికి వచ్చాడు. అప్పటి నుంచి ఐదో టౌన్ ఎస్సై తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని రసూల్ ఆరోపించారు. ఇబ్బందులు పెట్టే బదులు తనను ఎన్‌కౌంటర్ చేయాలని ఎస్సైని కోరారు. బుధవారం మధ్యాహ్నం 12గంటలకు నగరంలోని నెహ్రూ పార్క్‌కు వచ్చి తనను కాల్చివేయాలని గుండెను చూపించడం విశేషం.


షేక్ రసూల్

కేసు నమోదు చేస్తాం.

ఐదో టౌన్ ఎస్సైపై సోషల్ మీడియాలో సవాల్ విసిరిన షేక్ రసూల్‌పై కేసు నమోదు చేస్తామని ఏసీపీ రాజావెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ లో భాగంగా రౌడీ షీటర్ అయినా షేక్ రసూల్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిచి సత్ప్రవర్తన తో మెలగాలని చెప్పినట్లు పేర్కొన్నారు. విధులను ఆటంక పరుస్తూ, పోలీసుల మానసిక స్థైర్యం దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు నిందితుడిపై కేసు నమోదు కోసం కోర్టు అనుమతి కోరుతామని ఏసీపీ తెలిపారు.

నిర్లక్ష్యమేల..?

- ఆన్‌లైన్‌లో డెలివరీల వివరాలు పొందుపర్చని ప్రైవేట్ గైనిక్ ఆస్పత్రులు
- సమాచారం ఇవ్వడానికి ససేమిరా..
- జిల్లాలో 57 రిజిస్ట్రేషన్ ఆస్పతులు

నిజామాబాద్‌నాగారం: డెలివరీ చేశామా.. బిల్లు వసూలైందా.. డిశ్చార్జి చేశామా.. అంత వరకే మన బాధ్యత. పుట్టిన శిశువు ఆడా? మగా? తల్లీబిడ్డల హెల్త్ కండీషన్ ఏమిటి? వంటి వివరాలు మనకెందుకు అనేలా వ్యవహరిస్తున్నారు జిల్లాలోని గైనిక్ ఆస్పత్రుల నిర్వాహకులు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెలివరీలు, వ్యాక్సినేషన్, టీబీ, లెప్రసీకి సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం www.hmis.mohfw.gov.in లో పొందుపరిస్తే ప్రతి నెలా 5వ తేదీలోగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. అయితే ప్రైవేట్ గైనిక్ ఆస్పత్రులు తమకేమీ పట్టనట్లు సమాచారాన్ని ఇవ్వకుండా జాప్యం చేస్తూ చేతులు దులుపుకుంటున్నాయి.

జిల్లాలో ఆస్పత్రులు ఇలా..

జిల్లాలో 225 సబ్ సెంటర్లు, 27 పీహెచ్‌సీలు, 10 యూపీహెచ్‌సీలు, ఏడు సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రి(ఆర్మూర్), జిల్లా ఆస్పత్రి(బోధన్), జిల్లా కేంద్రంలో జీజీహెచ్ ఉన్నాయి. వీటితోపాటు రిజిస్ట్రేషన్ అయిన ప్రైవేట్ గైనిక్ ఆస్పత్రులు 57 ఉన్నాయి. అయితే ఈ ఆస్పత్రులన్నింటిలో చేస్తున్న డెలివరీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. హెచ్‌ఎంఐఎస్(హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం) వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది.

మాకేం సంబంధం అంటూ..

రిజిస్ట్రేషన్ ఉన్న 57 గైనిక్ ఆస్పత్రులకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ సంబంధిత అధికారులు ఇచ్చేశారు. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉండగా మాకేం సంబంధం అన్నట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతేడాదిగా వెబ్‌సైట్‌ను పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీల్లో వివరాలు సేకరించుకుని మీరే ఆన్‌లైన్ చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు.

అప్‌డేట్ చేస్తున్న ప్రభుత్వ ఆస్పత్రులు

ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో వివరాలను పొందుపరిస్తే జిల్లా వైద్యారోగ్యశాఖ కేంద్ర ప్రభుత్వానికి ఆ వివరాలను పంపిస్తుంది. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి సాధారణ డెలివరీలు, సిజేరియన్లు, వ్యాక్సినేషన్, సర్వీసెస్, టీబీ, లెప్రసీ తదితర సేవలు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరుస్తున్నారు. ప్రైవేట్ గైనిక్ ఆస్పత్రులు మాత్రం జిల్లా, ఉన్నతాధికారుల ఆదేశాలను పెడచెవిన పెడుతున్నారు. 57 గైనిక్ ఆసుపత్రులు ఉన్నా, కేవలం కొన్ని ఆస్పత్రులు మాత్రమే అంతంత మాత్రంగా సమాచారాన్ని అప్‌డేట్ చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తాం



హెచ్‌ఎంఐఎస్(హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం) ఆన్‌లైన్ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కచ్చితంగా అందిస్తున్న సేవల వివరాలను పొందుపర్చాలి. గతంలో అవగాహన కల్పించడం జరిగింది. ప్రభుత్వ ఆస్పతులు వివరాలను అప్‌లోడ్ చేస్తుండగా, ప్రైవేట్ గైనిక్ ఆస్పత్రుల వారు పట్టించుకోవడం లేదు. మళ్లీ సమావేశం పెట్టి అవగాహన కల్పిస్తాం. లేనిపక్షంలో కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. – రాజశ్రీ, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

వచ్చే నెల 9వరకే నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి యాసంగి సీజన్‌ కోసం వచ్చే నెల 9వ తేదీ వరకు మాత్రమే నీటి విడుదల కొనసాగుతుందని ప్రాజెక్ట్‌ ఈఈ చక్రపాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్‌ 2 వరకు కాకతీయ కాలువ జోన్‌–2, ఏప్రిల్‌ 9 వరకు కాకతీయ కాలువ జోన్‌–1, లక్ష్మి, సరస్వతి కాలువ తోపాటు లిఫ్టులకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. ఆ తర్వాత చుక్క నీరు కూడా వదిలే అవకాశం లేదని పేర్కొన్నారు. ఆయకట్టు రైతులు అప్పటి వరకు నీటిని సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడుకోవాలన్నారు.

ఆసియా కప్‌ పోటీలకు గురుకుల విద్యార్థినులు


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌

డిచ్‌పల్లి(నిజామాబాద్‌ రూరల్‌): భారత జట్టు అండర్‌–15 ఉమెన్స్‌ సాఫ్ట్‌బాల్‌ ఆసియా కప్‌ పోటీలకు డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ నళిని బుధవారం తెలిపారు. విద్యార్థినులు నిశిత, వర్షిణి, కీర్తన, ఆర్‌.సౌజన్య అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ నెల 26 నుంచి 30వరకు తైవాన్‌ దేశంలోని పులిలో జరిగే అండర్‌ –15 సాఫ్ట్‌బాల్‌ ఆసియా కప్‌ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాళ్లు నళిని, స్వప్న, జూనియర్‌ వైస్‌ ప్రిన్సిపాల్‌ వనిత, ఫిజికల్‌ డైరెక్టర్‌ జ్యోత్స్న, పీఈటీ నర్మద, సాఫ్ట్‌బాల్‌ అకాడమీ కోచ్‌ వేముల మౌనిక, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

కేంద్రమంత్రిపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

ఆర్మూర్‌టౌన్‌: బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్మూర్‌ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డికి బుధవారం బీఆర్‌ఎస్‌ నాయకులు ఫిర్యాదు చేశారు. బండి సంజయ్‌ వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్‌, నాయకులు సుంకరి రవి, దోండి శ్యామ్‌, శ్రావణ్‌, అగ్గు క్రాంతి, శ్రీకర్‌ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు


మానవతా సదన్‌లో స్టడీ రూంను ప్రారంభిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌ రూరల్‌): మానవతా సదన్‌ చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆకాంక్షించారు. డిచ్‌పల్లి టోల్‌ వే (అథాంగ్‌) ప్రైవేట్‌ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా సుమారు రూ.45 లక్షలతో మానవతా సదన్‌లో ఏర్పాటు చేసిన సదుపాయాలను బుధవారం కలెక్టర్‌ ప్రారంభించారు. సదన్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ అనాథ బాలలను అన్నివిధాలుగా ఆదుకునేందుకు గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన, ప్రస్తుత విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా 2016లో నెలకొల్పిన మానవతా సదన్‌ జాతీయ స్థాయిలో ప్రత్యేకతను చాటుకుంటోందన్నారు. సదన్‌లోని బాలలను సిబ్బంది సొంత బిడ్డలుగా చూసుకుంటూ వారి అభ్యున్నతికి పాటుపడుతుండడంతోనే అనేకమంది ఇంజినీరింగ్‌ వంటి ఉన్నత చదువులు చదువుతున్నారని అన్నారు. అందుబాటులో ఉన్న వనరులను, జిల్లా యంత్రాంగం తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఐఏఎస్‌, ఐపీఎస్‌లుగా రాణించాలని కలెక్టర్‌ ఆకాంక్షించారు. తాము అనాథలం, తమకు తల్లిదండ్రులు లేరనే భావన పిల్లల దరి చేరకుండా వారికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలు సమకూర్చేందుకు జిల్లా యంత్రాంగం చొరవ చూపుతోందన్నారు. ఈ దిశగా డిచ్‌పల్లి టోల్‌ వే ప్రైవేట్‌ లిమిటెడ్‌ (అథాంగ్‌) కంపెనీ కూడా ముందుకు రావడం అభినందనీయమన్నారు. పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరినప్పుడే మానవతా సదన్‌ ఆశయాలు, లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరినట్లు అవుతాయన్నారు. అంతకు ముందు సదన్‌ బాలికలు కుండలు, గాజు సీసాలపై రూపొందించిన కళాకృతులు, పెయింటింగ్‌లను కలెక్టర్‌ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ ప్రభాకర్‌, మానవతా సదన్‌ లైజనింగ్‌ ఇంచార్జి సుధాకర్‌ రావు, కేర్‌ టేకర్‌ రమేశ్‌, టోల్‌ వే ప్రైవేట్‌ లిమిటెడ్‌ కంపెనీ ప్రాజెక్ట్‌ మేనేజర్‌ అనిల్‌ కుమార్‌ సింగ్‌, మేనేజర్‌ చలపతిరావు, అసిస్టెంట్‌ మేనేజర్‌ రిషా, రోడ్‌ సేఫ్టీ విభాగం అధికారి హర్ష దేశ్‌పాండే, సేఫ్టీ మేనేజర్‌ పానుగంటి సతీశ్‌, నారాయణ మూర్తి, కృష్ణకాంత్‌, ఆర్‌ఐ సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను క్షయ నుంచి రక్షించుకుందాం

- డీఎంహెచ్‌వో రాజశ్రీ


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌ నాగారం: పిల్లల్లో క్షయ వ్యాధి నిర్మూలన కోసం కలిసికట్టుగా కృషి చేయాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ తెలిపారు. నగరంలోని నిఖిల్‌ సాయి హోటల్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ, టీబీ అలర్ట్‌ ఇండియా ఆధ్వర్యంలో పిల్లల్లో క్షయ వ్యాధి నిర్మూలనపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్‌ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో క్షయరహిత జిల్లాగా మారుద్దామన్నారు. డీసీహెచ్‌ఎస్‌ శ్రీనివాస ప్రసాద్‌ మాట్లాడుతూ పిల్లల్లో క్షయ వ్యాధి లక్షణాలు గుర్తించి, క్షయ బారి నుంచి కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజు గౌడ్‌, సాతి నేషనల్‌ కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ సందీప్‌, అనామిక, మేనేజర్‌ హెప్సీబ, విద్యాశాఖ సీఎంవో శ్రీనివాసరావు, టీబీ కో ఆర్డినేటర్‌ రవి తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో వాటర్‌ డిస్పెన్సర్ల ప్రారంభం


బార్‌ అసోసియేషన్‌ హాల్‌లో వాటర్‌ డిస్పెన్సర్లను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి సునీతా కుంచాల

ఖలీల్‌వాడి: జిల్లా కోర్టు ఆవరణలోని బార్‌ అసోసియేషన్‌ హాల్‌లో వాటర్‌ డిస్పెన్సర్లను జిల్లా జడ్జి సునీతా కుంచాల, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్‌ గౌడ్‌ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయవాది జేవీఆర్‌ బాబు తన తల్లి పేరిట వాటర్‌ డిస్పెన్సర్లను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ కార్యదర్శి వసంత్‌ రావు, న్యాయవాది జేవీఆర్‌ బాబు సతీమణి చార్టెడ్‌ అకౌంటెంట్‌ సవిత, సీనియర్‌ న్యాయవాదులు ఆర్‌.జగదీశ్వర్‌ రావు, కిరణ్‌ కుమార్‌ గౌడ్‌, ఆర్‌ రాజలింగం, కృపాకర్‌ రెడ్డి, రాజు కుమార్‌ సుబేదార్‌, విశ్వక్‌ సేవ్‌ పాల్గొన్నారు.

ముగిసిన‘బార్‌’ నామినేషన్ల పర్వం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణ బుధవారం ముగిసినట్లు ఎన్నికల అధికారులు జే వెంకటేశ్వర్‌, ఆర్‌.ఎస్‌.ఎల్‌ గౌడ్‌ తెలిపారు. అధ్యక్ష పదవికి సీనియర్‌ న్యాయవాది మామిళ్ల సాయరెడ్డి మాత్రమే నామినేషన్‌ పత్రాలను దాఖలు చేసినట్లు తెలిపారు. 27న నామినేషన్‌ పత్రాలను పరిశీలన, 28న ఉపసంహరణ, 29న పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన అనంతరం ఏప్రిల్‌ 11న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తామని వారు చెప్పారు.

వైద్యుల నియామకానికి కృషి


డిచ్‌పల్లి సీహెచ్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రి (సీహెచ్‌సీ)లో వైద్యులు, సిబ్బంది నియామకం కోసం వైద్య విధాన పరిషత్‌కు లేఖ రాస్తానని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. డిచ్‌పల్లి సీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. సీహెచ్‌సీలో 5 డయాలసిస్‌ యంత్రాల ద్వారా రెగ్యులర్‌గా 18 మంది కిడ్నీ రోగులకు వైద్య సేవలందిస్తున్నట్లు డాక్టర్‌ సందీప్‌ రెడ్డి, డాక్టర్‌ రాజశ్రీ కలెక్టర్‌కు వివరించారు. గతంలో వైద్యారోగ్యశాఖ ఆధీనంలో ఉన్న సీహెచ్‌సీ ప్రస్తుతం వైద్య విధాన పరిషత్‌ ఆధీనంలోకి వెళ్లిందన్నారు. 30 పడకల ఆస్పత్రిలో ఐదుగురు రెగ్యులర్‌ డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు, 9 మంది స్టాఫ్‌ నర్సులకు గానూ ఆరుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గైనకాలజిస్టు, సర్జన్‌, నెఫ్రాలజిస్ట్‌, ఫార్మాసిస్టు తదితర పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో డెంటల్‌ డాక్టర్‌ సరిత, ఆయూష్‌ డాక్టర్‌ సుబూర్‌, ఫార్మాసిస్టు రాధాకృష్ణ, హెల్త్‌ అసిస్టెంట్‌ గోపీ, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్‌ సిఫారసులు అమలు చేయాలి



మాట్లాడుతున్న వీసీ అల్దాస్‌ జానయ్య, అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న నాయకులు

- ప్రొఫెసర్‌ జయశంకర్‌ వర్సిటీ వీసీ అల్దాస్‌ జానయ్య

నిజామాబాద్‌ సిటీ: రైతు సమస్యల పరిష్కారానికి స్వామినాథన్‌ కమిషన్‌ సిఫారసులు వెంటనే అమలు చేయాలని, రైతులు తలచుకుంటే ప్రభుత్వాలు తారుమారవుతాయని ప్రొఫెసర్‌ జయశంకర్‌ వర్సిటీ వీసీ అల్దాస్‌ జానయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌ హాల్లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం 3వ మహాసభలు నిర్వహిస్తున్నారు. రెండోరోజు బుధవారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులు మాజీ ఎమ్మెల్యే ఉజ్జయిని యాదగిరి రావు, భాగం హేమంతరావు, ముత్యాల విశ్వనాథం, రవీందర్‌ రెడ్డి, దేవభక్తుని సంధ్య, డి.జి నరేంద్ర ప్రసాద్‌, సారంపల్లి మల్లారెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, పశ్య పద్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ అల్దాస్‌ జానయ్య మాట్లాడుతూ రైతు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. స్వామినాథన్‌ సిఫారసుల ప్రకారం మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. వ్యవసాయరంగ అభివృద్ధి కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి బాధ్యత అన్నారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తులు పెరగడం శుభసూచకమన్నారు. రైతులు ఒకే రకం పంటలు కాకుండా అన్ని రకాల పంటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌, ఓమయ్య, వార్ల వెంకటయ్య, కే గోవింద్‌, కంబాల శ్రీనివాస్‌, కొల్లూరి రాజయ్య, ప్రభు లింగం, రామచంద్రం, దేవీదాస్‌, సారంగపాణి, బొల్లు ప్రసాద్‌, రాజేశ్‌, దొండపాటి రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌ అర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘రాజీవ్‌ యువ వికాసం’ స్వయం ఉపాధి పథకానికి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక రేషన్‌ కార్డుకు ఒకరు మాత్రమే అర్హులని, ఈ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు యూనిట్‌ అందించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయేతర పథకాలకు 21–55 ఏళ్లు, వ్యవసాయ ఆధారిత పథకాలకు 21–60 ఏళ్ల వయసు ఉండాలని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలు వారు అర్హులని, బ్యాంక్‌ సమ్మతి తప్పనిసరిగా కావాలని పేర్కొన్నారు. దరఖాస్తుకు ఆధార్‌, పాన్‌ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత, బ్యాంక్‌ ఖాతా ప్రతులను తప్పనిసరిగా జత చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఏదో ఒక అంశాన్ని ఎన్నుకొని స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన దరఖాస్తుకు మిగతా ప్రతులు జతచేసి అర్జీదారులు ఎంపీడీవో, మున్సిపల్‌ కమిషనర్‌ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. ఏప్రిల్‌ 5వ తేదీలోగా https://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖా స్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

‘సమన్విత’ కార్యకలాపాలు నిలిపివేయాలి

- లింగ నిర్ధారణ కేసులో ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు



కోర్టు ఆర్డర్‌ ప్రతులను ఆస్పత్రి గోడకు అతికించిన వైద్య శాఖ సిబ్బంది

కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్‌ కాలనీలోగల సమన్విత ప్రైవేట్‌ ఆస్పత్రిలో కార్యకలాపాలు నిలిపివేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2022లో శ్రీరాంనగర్‌ కాలనీలోని ఓ అద్దె భవనంలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన కేసులో రాష్ట్ర, జిల్లా వైద్య శాఖ అధికారులు డెకాయ్‌ ఆపరేషన్‌ చేపట్టి సాక్ష్యాలతో కౌసల్య ఆస్పత్రిని సీజ్‌ చేశారు. ఇదే యజమాన్యం పేరు మార్చి అదే కాలనీలో సొంత భవనంలో సమన్విత పేరిట ఆస్పత్రిని ప్రారంభించింది. 2024లో లింగ నిర్ధారణ, శిశు విక్రయం వ్యవహారంలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌ కింద పలు కేసులు నమోదు అయ్యాయి. అదే ఏడాదిలో స్కానింగ్‌ యంత్రాలు తరలిస్తుండగా పట్టుకుని మొబైల్‌ స్కానింగ్‌ చేస్తున్నారని యంత్రాలను, ఆస్పత్రిని సీజ్‌ చేసి కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఆస్పత్రి యాజమాన్యంలో ఒకరైన గాంధారి సీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌ను డీఎంహెచ్‌వో ప్రభుత్వానికి సరెండర్‌ చేశారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి యాజమాన్యం వైద్య ఆరోగ్యశాఖ తీరును సవాల్‌ చేస్తూ ఆరు నెలల క్రితం హైకోర్టును ఆశ్రయించి రిట్‌ పిటిషన్‌ దాఖలు చేసింది. దీనిపైన హైకోర్టు విచారణ చేపట్టగా.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సాక్ష్యాధారాలను, షోకాజ్‌ నోటీస్‌ డాక్యుమెంట్లను హైకోర్టుకు సమర్పించింది. ఇరు వర్గాల వాదనలు విన్న హైకోర్టు.. బుధవారం తీర్పునిచ్చింది. సమన్విత ఆస్పత్రిలో ఎలాంటి కార్యకలాపాలు కొనసాగించవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఆస్పత్రి యాజమాన్యంలో ఒకరైన గాంధారి మెడికల్‌ ఆఫీసర్‌ ప్రవీణ్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆర్డర్స్‌ ప్రతులను ఇవ్వడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది బుధవారం ఆస్పత్రికి వెళ్లగా ఆర్డర్స్‌ను తీసుకోవడానికి యాజమాన్యం తిరస్కరించిందని అధికారులు తెలిపారు. ఆస్పత్రి గోడకు కోర్టు ఆర్డర్స్‌ ప్రతులను అతికించామన్నారు. ఆ ఆస్పత్రికి ఎవరూ వైద్యంకోసం రావద్దని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ సూచించారు.

విద్యుత్‌ మీటర్‌లో నాగు పాము


విద్యుత్‌ మీటర్‌లో ఉన్న నాగుపాము

ఎల్లారెడ్డిరూరల్‌: విద్యుత్‌ మీటర్‌లోకి చేరిన నాగుపాము ఎల్లారెడ్డి పట్టణంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. సాయిబాబా వాటర్‌ సర్వీసింగ్‌ సెంటర్‌లో బుధవారం ఉదయం నిర్వాహకులు మోటార్‌ ఆన్‌ చేసే క్రమంలో మీటర్‌లో నుంచి బుసలు కొడుతున్న శబ్దం రాగా, లో పల గమనించగా నాగు పాము కనిపించింది. చుట్టుపక్క ల వారు వచ్చి మీటర్‌ డోర్‌ తెరిచే సరికి పాము అక్కడి నుంచి జారుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగురికి జైలు

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి జైలు శిక్ష పడినట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ బుధవారం తెలిపారు. సీపీ సాయి చైతన్య ఆదేశాలతో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ 17మంది పట్టుబడ్డారని పేర్కొన్నారు. ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఏసీపీ టి.నారాయణ ఆధ్వర్యంలో సీఐ ప్రసాద్‌ కౌన్సిలింగ్‌ నిర్వహించారు. అనంతరం సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ ఎదుట హాజరుపరచగా 10 మందికి రూ.14 వేలు జరిమానా, ఏడుగురికి రెండు నుంచి మూడురోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

బోధన్‌లో ఒకరికి..

రుద్రూర్‌: డ్రైంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో బోధన్‌ మండలానికి చెందిన గంగాధర్‌ అనే వ్యక్తికి బోధన్‌ న్యాయమూర్తి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

బాల్కొండ: కాకతీయ కాలువలో గల్లంతైన లఖడే రాజారాం(28) మృతదేహం బుధవారం మెండోరా మండలం వెల్కటూర్‌ శివారులో లభ్యమైనట్లు మెండోరా ఎస్సై నారాయణ తెలిపారు. మహారాష్ట్రలోని టింగస్‌వాడీకి చెందిన మారుతి దేశ్‌ముఖ్‌ (32) సోమవారం గల్లంతుకాగా, అతనిని వెతికేందుకు వెళ్లి బైక్‌తో సహా రాజారాం గల్లంతైన విషయం తెలిసిందే. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్‌ ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్‌

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బొలెరో

- కూతురు మృతి, తండ్రికి తీవ్రగాయాలు


విజయలక్ష్మి (ఫైల్‌)

నిజాంసాగర్‌(జుక్కల్‌): నాందేడ్‌ – సంగారెడ్డి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పిట్లం మండలం కంభాపూర్‌ గ్రామానికి చెందిన ఇప్ప సత్యవ్వ–సాయిలు దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. సాయిలు కంభాపూర్‌ జీపీలో ఫిట్టర్‌మన్‌గా పనిచేస్తున్నాడు. పెద్ద కూతురు విజయలక్ష్మి(12) సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గం మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కూతురును చూసేందుకు సాయిలు బైక్‌పై అల్లదుర్గానికి వెళ్లి.. వచ్చేటప్పుడు కూతురుని తీసుకొని కంభాపూర్‌కు వస్తున్నాడు. నిజాంసాగర్‌ మండలం మంగ్లూర్‌ గ్రామ శివారులో జాతీయ రహదారిపై బొలెరో వాహనం రాంగ్‌ రూట్‌లో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో తండ్రీ కూతుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. హైవే అంబులెన్స్‌ సిబ్బంది క్షతగాత్రులను సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిస్తుండగా విజయలక్ష్మి మృతి చెందింది. సాయిలు చికిత్స పొందుతున్నాడు. నిజాంసాగర్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌ మృతి


ఆశయ్య (ఫైల్‌)

లింగంపేట/ఎల్లారెడ్డి రూరల్‌ (ఎల్లారెడ్డి): మండలంలోని మాలపాటి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌ కంపె ఆశయ్య(46) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆశయ్య మంగళవారం సాయంత్రం ఎల్లారెడ్డి నుంచి బైక్‌పై స్వగ్రామం మాలపాటికి వస్తుండగా శివ్వాపూర్‌ సమీపంలో ఎదురుగా సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో ఎల్లారెడ్డికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

నవీపేట: మండలంలోని మిట్టాపూర్‌ గ్రామానికి చెందిన మేకల లస్మన్న(49) చేపలు పట్టేందుకు వెళ్లి మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌ బుధవారం తెలిపారు. మంగళవారం ఉదయం గోదావరిలో చేపలు పట్టేందుకు వెళ్లి సాయంత్రం తిరిగి రాలేదన్నారు. బుధవారం ఉదయం గోదావరిలో మృతదేహం కనిపించిందన్నారు. మృతుడి భార్య పోసాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నీటమునిగి పశువుల కాపరి ..

మాక్లూర్‌: ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందినట్లు మాక్లూర్‌ పోలీసులు బుధవారం తెలిపారు. మండలంలోని మాదాపూర్‌కు చెందిన అత్రం సత్యనారాయణ (50) కూలీ రీత్యా మంగళవారం పశువులను మేపడానికి వెళ్లాడు. నీళ్లు తాగించేందుకు పశువులను మాదాపూర్‌ చెరువులోనికి తోలాడు. అవి ఎంతకూ బయటకు రాకపోవటంతో సత్యనారాయణ వాటిని బయటకు వచ్చేలా చేసేందుకు చెరువులోనికి దిగాడు. ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న మొరం గుంతలో మునిగి గల్లంతై బుధవారం శవమై తేలాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి నా అనేవారెవరూ లేనట్లు సమాచారం.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం

- ఒకరి మృతి

నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని మంగ్లూర్‌ గేటు వద్ద సంగారెడ్డి– నాందేడ్‌ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌ ప్రాంతానికి చెందిన వ్యక్తి అని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై శివకుమార్‌ తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

- పరారీలో మరొకరు

నందిపేట్‌ (ఆర్మూర్‌): చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులలో ఒకరిని అరెస్టు చేసి మరొకరి కోసం గాలిస్తున్నట్లు నందిపేట ఎస్సై చిరంజీవి తెలిపారు. మండలంలోని ఐలాపూర్‌ గ్రామానికి చెందిన శంకర్‌ తన భార్యతో కలిసి ఈ నెల 24న ఉదయం 11 గంటలకు ఇంటికి తాళం వేసి అదే గ్రామంలోని యూనియన్‌ బ్యాంకుకు వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి 11:50 గంటలకు ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసేసరికి బెడ్రూంలోని కబోర్డ్‌లో ఉన్న 10 గ్రాముల బంగారు బ్రాస్లెట్‌, 10 తులాల వెండి పట్టగొలుసులు, 20వేల నగదును దుండగులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దుండగుల కోసం గాలింపులు చర్యలు చేపట్టారు. దొంగతనానికి పాల్పడ్డ మాక్లూర్‌ మండలం బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన ఏరుగట్ల సందీప్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌ తరలించినట్లు ఎస్సై తెలిపారు. మరో వ్యక్తి మహారాష్ట్రకు చెందిన నాందేవ్‌ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్‌

మోర్తాడ్‌: భీమ్‌గల్‌లోని కప్పలవాగు నుంచి రాత్రిపూట అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్‌ చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. అనుమతి లేకుండా, అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జల్సాలకు అలవాటుపడి బైక్‌ల చోరీ

- నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

ఖలీల్‌వాడి: జల్సాలకు అలవాటుపడి బైక్‌ దొంగతనాలకు పాల్పడుతున్న ఒకరిని అరెస్ట్‌ చేసినట్లు నార్త్‌ రూరల్‌ సీఐ బీ శ్రీనివాస్‌ బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన ప్రకారం నందిపేట్‌ మండలంలోని కసాబ్‌గల్లీకి చెందిన షేక్‌ అహ్మద్‌ మేస్త్రీ పని చేసుకుంటూ జీవించేవాడు. గతంలో చుట్టుపక్కల ఏరియాల్లో గాజులు అమ్మేవాడు. వచ్చే డబ్బులు కుటుంబ అవసరాలు, జల్సాలకు సరిపోకపోవడంతో బైక్‌ల చోరీ మొదలుపెట్టాడు. చోరీ చేసిన బైక్‌లను మహారాష్ట్రతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అమ్మేసి, వచ్చిన డబ్బులతో జల్సాలకు అలవాటుపడ్డాడు. ఐదో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని నాగారం బ్రాహ్మణ్‌ కాలనీకి చెందిన లాడేవాడ్‌ లక్ష్మీకాంత్‌ ఈ నెల 25న తన ఆటో ఎవరో దొంగిలించడానికి యత్నించినట్లు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా నిందితుడిని గుర్తించామన్నారు. నగరంలోని న్యాల్‌కల్‌ రోడ్డులోని రేడియో స్టేషన్‌ వద్ద నిందితుడు షేక్‌ అహ్మద్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై గంగాధర్‌తోపాటు సిబ్బందిని అభినందించారు.

యాక్సిడెంట్‌ కేసులో ఇద్దరికి జైలు

- తుపాన్‌ డ్రైవర్‌కు మూడేళ్లు... ఆటో డ్రైవర్‌కు మూడు నెలలు

రుద్రూర్‌: పదేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ బుధవారం బోధన్‌ కోర్టు న్యాయమూర్తి శివసాయి తీర్పు వెలువరించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2014 అక్టోబర్‌ 3న అక్బర్‌నగర్‌ శివారులో ఆటోను తుపాన్‌ వాహనం ఢీకొన్న ఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురు మహిళలు, ఒక పాప మరణించారు. ఈ దుర్ఘటనపై అప్పటి వర్ని ఎస్సై సుఖేందర్‌ రెడ్డి కేసు నమోదు చేయగా సీఐ దామోదర్‌ రెడ్డి.. మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా ధన్‌గావ్‌ పంకజ్‌నగర్‌ వాసీకి చెందిన తుపాన్‌ డ్రైవర్‌ బల్కి శివాజీ బలరాం, కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌ షేక్‌ మజీద్‌పై చార్జ్‌షీట్‌ దాఖలు చేశారు. పదేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం బుధవారం న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి నలుగురి మృతికి కారణమైన తుపాన్‌ డ్రైవర్‌కు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.3 వేల జరిమానా విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లిన ఆటో డ్రైవర్‌కు మూడు నెలల కఠిన కారాగార శిక్ష, రూ.500ల జరిమానా విధించడంతోపాటు ఆరు నెలలపాటు లైసెన్స్‌ రద్దు చేశారు. ఈ కేసులో పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ సీహెచ్‌ రాణి వాదనలు వినిపించారని ఎస్సై తెలిపారు.

మృతికి కారణమైన ఇద్దరికి మూడేళ్లు..

కామారెడ్డి క్రైం: ఓ వివాహిత మరణానికి కారణమైన ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూర్‌ మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన బొజ్జ దివ్య అనే వివాహితను ఆమె చిన్న మామ బాలయ్య, సింగిలి వంశీలు వేధించేవారు. మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకున్నావని తరచూ మాటలు అనడం, వేధింపులకు గురిచేయడంతో 2023 జూలై 10న దివ్య ఇంటి వద్ద ఒంటిపై కిరోసిన్‌ పోసుకొని నిప్పంటించుకుంది. హైదరాబాద్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ దివ్య చనిపోయింది. బాలయ్య, వంశీ కారణంగానే తన చెల్లెలు చనిపోయినట్లు దివ్య సోదరుడు పరశురాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరిపి నిందితులను రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో మహిళ మృతికి కారణమైన ఇద్దరు నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ సీనియర్‌ సివిల్‌ జడ్జి సుమలత తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్షపడేలా సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టిన సీఐలు తిరుపతయ్య, సంపత్‌ కుమార్‌, ఎస్సైలు ఆనంద్‌ గౌడ్‌, మురళి, పీపీ రాజగోపాల్‌ గౌడ్‌, పోలీసు సిబ్బంది ప్రమోద్‌ రెడ్డి, రాజశేఖర్‌ గౌడ్‌ను ఎస్పీ రాజేశ్‌ చంద్ర అభినందించారు.

దురుసుగా ప్రవర్తించిన ఏడుగురికి..

బోధన్‌: పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించి, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి రోడ్డుపై ధర్నా చేయడంతోపాటు ఓటర్లను ఆటంకపర్చిన కేసులో ఏడుగురికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం బోధన్‌ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎం. పూజిత తీర్పు వెలువరించారు. జైలు శిక్ష పడిన వారిలో బోధన్‌, సాలూర మండల కేంద్రానికి చెందిన వ్యక్తులున్నారని బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి తెలిపారు.